ప్రజాశక్తి

ఆదివారం 18 డిసెంబర్ 2022

5

అల్లూరి సీతారామరాజు

పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల్లో పర్యాటకులు పోటెత్తారు. అనంతగిరి ఘాట్, డముకు యు పాయింట్, బొర్రా గుహలు, కటికి, చిట్టంపాడు, కాఫీ ప్లాంటేషన్ ప్రాంతాలలో విదేశీ, ఇతర ప్రాంతాలకు చెందిన వేలాది మంది పర్యాట కులతో కిటకిట లాడాయి. కటికి, చిట్టంపాడు జల పాతాలను సందర్శించిన పర్యాటకులు స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. అరకు పద్మాపురం గార్డెన్, ట్రైబల్ మ్యూజియం వద్ద సందడి చేశారు. పలు ప్రాంతాల్లో వాహనాల రద్దీ నెలకొంది.

డముకు వద్ద పర్యాటకులు

'హైడ్రో'పై గిరిజనం భగ్గు

- చింతపల్లి ఏజెన్సీ బంద్ విజయవంతం
- స్వచ్ఛందంగా మూతపడిన దుకాణాలు, నిలిచిన వాహనాలు
- చింతపల్లి, కొయ్యూరు, జికె.వీధిల్లో నిరసనల వెల్లువ
- అనుమతులు రద్దు చేయకుంటే అల్లూరి బాటలో పోరాటం : గిరిజన సంఘం నేతలు సురేంద్ర, అప్పలనర్స
- ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కార్పొరేట్ కంపెనీల ఏజెంట్ అని విమర్శ

కొయ్యూరులో రాస్తారోకో చేస్తున్న సురేంద్ర, పలు పార్టీల నేతలు

ప్రజాశక్తి - పాడేరు

షెడ్యూల్డ్ ఏరియాలో నిబంధనలను ఉల్లంఘించి చింతపల్లి మండలం ఎర్రవరం వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రయివేటు సంస్థకు ప్రభుత్వాలు అప్పగించడాన్ని నిరసిస్తూ చింతపల్లి మన్యంలో ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన తలపెట్టిన బంద్ విజయవంతమైంది. అఖిలపక్ష పార్టీలు, పలు ప్రజా సంఘాలు మద్దతు తెలుపుతూ పోరాటంలో పాల్గొన్నాయి. ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టు ప్రభావిత మండలాలైన చింతపల్లి, కొయ్యూరు, జికె.వీధి మండలాల్లో ఎక్కడికక్కడ నిరసనలు ఎగసిపడ్డాయి. వేలాది మంది గిరిజనులు నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. బంద్‌తో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. ఆటో డ్రైవర్లు ఆటోలను ఎక్కడికక్కడ నిలిపివేసి బంద్‌కు సహకరించారు. ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టుకు కేంద్రం ఇచ్చిన పర్యావరణ అనుమతులను రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గంలో చేసిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పెద్ద పెట్టున గిరిజనులు నినదించారు. ఉదయం నాలుగు గంటలకే ఆంధ్ర కాశ్మీర్‌గా పేరు పొందిన చింతపల్లి మండలం లంబసింగి పర్యాటక ప్రాంతం ముఖద్వారానికి పెద్ద ఎత్తున గిరిజనులు చేరుకొని రాకపోకలను అడ్డుకున్నారు. అనంతరం అక్కడ నుంచి మండల కేంద్రానికి వచ్చి స్థానిక హనుమాన్ జంక్షన్‌లో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, గిరిజన సంఘాలతో కలిసి మెయిన్ రోడ్డులో బైఠాయించారు. పాత బస్టాండ్ వద్ద జరిగిన బహిరంగ సభలో గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ ఎర్రవరం హైడ్రో ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన అటవీ పర్యావరణ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలన్నారు. ఐదో షెడ్యూల్ ఏరియాలో గ్రామ సభ తీర్మానం లేకుండా హైడ్రో ప్రాజెక్టును శిరిడీ సాయి కంపెనీకి అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం గిరిజన ప్రాంతాలను విచ్ఛిన్నం చేయడం తగదన్నారు. ఎర్రవరం గ్రామస్తులకు పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాయమాటలు చెబుతున్నారన్నారు. ఆమె ఓ కార్పొరేట్ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ మాధవి తీరు కూడా అలానే ఉందన్నారు.

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ తక్షణమే హైడ్రో పవర్ ప్రాజెక్టు ఉత్తర్వులను రద్దు చేయాలన్నారు. గిరిజన హక్కులను కాలరాస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదన్నారు. సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ రాబోయే జిల్లా పరిషత్, ఐటిడిఎ పాలకవర్గ సమావేశాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుపై చర్చకు పట్టుబడతానని తెలిపారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానన్నారు. కాంగ్రెస్ పాడేరు ఇన్‌ఛార్జి వంతల సుబ్బారావు, ఎపి గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్యపడాల్, నాయకులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, టిడిపి నాయకులు సల్లంగి జ్ఞానేశ్వరి, లక్ష్మయ్య, కాంగ్రెస్ నాయకులు సూరిబాబు, కృష్ణ పడాల్, లకె రమణ, కంకిపటి వీరన్నపడాల్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు జీవన్ కృష్ణ కార్తీక్, హైడ్రో పవర్ ప్రాజెక్టు బాధిత గ్రామాల గిరిజన నాయకులు ఉల్లి సత్యనారాయణ, బెన్న స్వామి, సోమరాజు, గూడెపు రాజు, భారీ సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

కొయ్యూరు : ఎర్రవరం వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల పిలుపు మేరకు శనివారం చేపట్టిన బంద్ మండలంలో విజయవంతమైంది. బంద్‌ను పురస్కరించుకొని గిరిజన సంఘం, ఆదివాసీ జెఎసితో పాటు సిపిఎం, సిపిఐ, టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ చింతపల్లి, కొయ్యూరు మండలాల పరిధిలో హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి షిరిడీ సాయి ప్రైవేటు కంపెనీకి అనుమతులు ఇవ్వడం దారుణమన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల సుమారు 32 గ్రామాలకు చెందిన ఆరు వేల మంది గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లనుందని పేర్కొన్నారు. రైవాడ దగ్గర పెదకోట పరిధిలో మరో హైడ్రో ప్రాజెక్టును అదానీకి చెందిన గ్రీన్ ఎనర్జీ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టిందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి తలొగ్గి రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు విచ్చల విడిగా అనుమతులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. గిరిజనులపై ప్రేమ వలకబోసే వైసిపి వారి మనుగడను ప్రశ్నార్థకం చేసే ఇటువంటి ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వడం గిరిజనులను మోసగించడమే అవుతుందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో ప్రభుత్వం కూడా ప్రైవేటు కిందకే వస్తుందని సమతా తీర్పులో సుప్రీం కోర్టు వెల్లడించిందని గుర్తు చేశారు. 1/70, పీసా చట్టాల ప్రకారం గ్రామసభల ఆమోదం లేకుండా ఏజెన్సీలో ఏ ప్రాజెక్టు చేపట్టకూడదని, అలాంటిది ఏకపక్షంగా కేబినెట్ అదానీ, షిరిడీ సాయి ప్రైవేటు కంపెనీలకు ఎలా అనుమతులు ఇచ్చిందని ప్రశ్నించారు. తక్షణమే అనుమతులు రద్దు చేయాలని, లేకుంటే అల్లూరి సీతారామరాజు బాటలో గిరిజనులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు, మాజీ ఎంపిపి గోలిసింగి సత్యనారాయణ, కొయ్యూరు సర్పంచ్ ఎం.బాలరాజు, టీడీపీ నాయకులు దొరబాబు, జనసేన నాయకులు లక్ష్మణరావు, బుజ్జిబాబు, సిపిఐ నాయకులు నాగరాజు, నూకరాజు, సిపిఎం నాయకులు వై.అప్పలనాయుడు, జేఏసీ నాయకులు మాకాడ బూర్గులయ్య, సీఐటీయూ నాయకులు కె.రామ్మూర్తి, గిరిజన సంఘం నాయకులు ప్రభాకర్, కొండలరావు, ప్రజలు పాల్గొన్నారు.

చింతపల్లిలో భారీ నిరసన ర్యాలీ చేపట్టిన గిరిజన సంఘం, పలు పార్టీల నేతలు

చింతపల్లిలో రోడ్డుపై బైఠాయించిన గిరిజనులు

శారద చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న పాఠశాల సిబ్బంది

ఘనంగా శారద వర్ధంతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకువేలి శారద నికేతన్ పాఠశాలలో శనివారం డి.శారద 18వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ చిరంజీవులు, హిందీ టీచర్ టి.కృష్ణకుమారి, సిబ్బంది శారద చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల వైస్ ప్రిన్సిపల్ చిరంజీవి మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన బిడ్డలకు ఇంగ్లీష్ మీడియం చదువు అందించాలనే ఉద్దేశంతో శారదా కళల మేరకు శారదా ట్రస్ట్ పేరుతో మన పాఠశాల స్థాపించడం విశేషమన్నారు. శారద కష్టజీవులు, మహిళల హక్కుల కోసం గిరిజన ప్రాంతంలో సేవలందించారన్నారు. ఎన్నో సంవత్సరాలు కష్టజీవుల తరపున సుదీర్ఘమైన పోరాటం నిర్వహించారని చెప్పారు. గిరిజన ప్రాంతంలో మంచినీరు, తదితర సమస్యలపై పోరాటం చేశారని గుర్తు చేశారు. ఏజెన్సీలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి మందులు పంపిణీ చేశాని చెప్పారు. శారద ట్రస్ట్ పేరుతో మారుమూల గ్రామాలకు తాగు నీరు సరఫరా చేస్తున్నారన్నారు. ఆర్థిక సామాజిక, సాంఘిక అసమానతలు రూపుమాపాలని అనేక పోరాటాలు నడిపారాని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శారద స్కూల్ ఉపాధ్యాయులు విజయ్, నాగలక్ష్మి, జగన్నాథం. బాబురావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియంలో శ్రామిక మహిళా ఉద్యమ నేత డి.శారద 18వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో శారద చిత్ర పటానికి పూలమాలలు వేసి, మౌనం పాటించి నివాళు అర్పించారు. శారద చేసిన త్యాగాలు, పేదల పట్ల సేవలు గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండల కేంద్రంలో శారద ట్రస్ట్ ఆధ్వర్యంలో శారద నికేతన్ పాఠశాల నడపడానికి ఆమె త్యాగ ఫలితమేనన్నారు. ఆమె జ్ఞాపకార్థంగా గతంలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు, అవగాహన సదస్సు, బాల్య వివాహాలపై అవగాహన, మహిళలకు ప్రత్యేక చట్టాలు, హక్కులపై అవగాహన కార్యక్రమాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యరాజు, దొన్ను, ఉషారాణి, రత్నకుమారి, ఝాన్సీ, సుస్మిత, సంగీత, ప్రకాష్, సుందరమ్మ, గౌరి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని కురిడి పంచాయతీ సనత్‌నగర్ గ్రామంలో వితంతు, నిరుపేద మహిళలకు మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళ విభాగ అధ్యక్షురాలు కృష్ణకుమారి, అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు, చీరలను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, నిరుపేద మహిళలకు ఉదార భావంతో సేవలందించాలన్న లక్ష్యంతో గిరిజన గ్రామాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, ఆ గ్రామస్తులు పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ చేస్తున్న కృష్ణకుమారి

మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు బొర్రయ్య

అటవీశాఖ అధికారుల వేధింపులు ఆపాలి

- గిరిజన సంఘం కూనవరం మండల కార్యదర్శి బొర్రయ్య

ప్రజాశక్తి-విఆర్.పురం

గిరిజనులపై అటవీశాఖ అధికారుల వేధింపులు ఆపాలని గిరిజన సంఘం కూనవరం మండల కార్యదర్శి బి.బొర్రయ్య డిమాండ్ చేశారు. కూనవరం మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అటవీ చట్టాలను తుంగలో తొక్కితున్నాయన్నారు. 40 ఏళ్లగా నివసిస్తున్న జీవిస్తున్న గిరిజనులను ఇల్లు కట్టుకోవద్దని చట్ట, ఏ జిఓ ప్రకారం బెదిరిస్తున్నారో ఫారెస్ట్ అధికారులు బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయాలని డిమాండ్ చేశారు. పూర్వం నుండి 2005 డిసెంబర్ ముందు వరకు అటవీ ప్రాంతంలో సాగు భూమిలో ఉన్న వారికి పట్టాలు మంజూరు చేయాలని, ఇళ్ళు, రోడ్లు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని 2006 అటవీ హక్కుల చట్టం చెప్పుతున్నా, ప్రభుత్వం అధికారులు దానిని అమలు చేయడం లేదన్నారు. గిరిజనులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా బెదిరించటం చూస్తుంటే బ్రిటిష వారి పాలన గుర్తుకోస్తుందని పేర్కొన్నారు. తక్షణమే ఫారెస్ట్ అధికారుల వేధింపులు ఆపాలని, గిరిజనులు నివాసగృహాలు కట్టడానికి సహకరించాలని డిమాండ్ చేశారు. నేడు మోడీ ప్రభుత్వం అటవీ హక్కు చట్టాలను సవరిస్తుందని, దానికి వ్యతిరేకంగా గిరిజనులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు టి.తమ్మయ్య, పాయం సీతారామయ్య, ఎన్.రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని రాజవొమ్మంగి గ్రామ శివారులో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. బడదనాంపల్లి, రాజవొమ్మంగి ప్రధాన రహదారి మీదుగా వచ్చిపోయే ప్రతి వాహనాన్ని ఆపి రికార్డులు నిశితంగా పరిశీలించారు. రికార్డులు సక్రంగా లేని, మద్యం సేవించిన వాహనదారులనుండి అపరాధ రుసుము వసూలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేంద్రప్రసాద్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఏపీఎస్పీ బెటాలియన్ పాల్గొన్నారు.

వాహనదారుడిని ప్రశ్నిస్తున్న పోలీసులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు రూ.10 వేలు ఇవ్వాలి
- సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి-చింతూరు

అన్ని మండల కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సీపీఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో వరదల్లో నష్టపోయిన బాధితులకు ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.10 వేల నష్ట పరిహారం తక్షణమే ఇవ్వాలని కోరారు. శనివారం సిపిఎం జిల్లా నాయకులు పల్లపు వెంకట్ అధ్యక్షత జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు కొనుగోలు చేయక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరదల్లో నష్టపోయిన బాధితులకు రూ.10 వేలు ఇస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి, దానిని అమలు చేయకుండా గోదాట్లో ముంచారని విమర్శించారు. తక్షణమే ముఖ్యమంత్రి హామీని అమలు చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కుంజా సీతారామయ్య, మండల కార్యదర్శి సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాస్, రంగమ్మ, నాగేష్, సుబ్బారావు, రమేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ఏజెన్సీలో భూములకు పక్కాగా రీ సర్వే

జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజెన్సీలోని ప్రభుత్వ, ప్రైవేట్ భూములు అన్నింటికీ పక్కాగా రీ సర్వే చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవీపట్నం మండలం దేవారం, శరభవరం గ్రామాల్లో శనివారం జెసి పర్యటించారు. భూముల రీసర్వే ఏవిధంగా జరుగుతుందో పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూహక్కు. భూరక్ష పథకం ద్వారా సర్వే చేసిన భూములు అన్నింటికీ రైతులకు హక్కు పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. సర్వే చేసే సమయంలో ముందుగా రైతులకు నోటీసులు అందజేయాలని, సర్వే చేసే సమయంలో భూములకు హద్దులు చూపించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యాన్ని విక్రయించే విధంగా, దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతుల దగ్గర కొనుగోలు చేసిన ధాన్యానికి లారీలలో లోడు చేసిన వెంటనే సంబంధిత రైతులకు రసీదులు ఇవ్వాలని, సంబంధిత రైస్ మిల్లర్లతో ఎప్పటికప్పుడు సిబ్బంది మాట్లాడాలని సూచించారు. అనంతరం రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అన్ని మండలాలకు సంబంధించిన సచివాలయాల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. భూహక్కు భూరక్ష రీసర్వే ద్వారా కొరిలేషన్ డేటా ఎంట్రీని ఏ విధంగా చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వేలో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం కె.గణేష్ కుమార్, డివిజనల్ సివిల్ సప్లై అధికారి సి.శ్రీహరి, వీఆర్వోలు శివకుమార్, ఆనంద్, సీనియర్ అసిస్టెంట్ త్రిమూర్తులు, మండల సర్వేయర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

విద్యుత్ ఉత్పత్తికి బలిమెల జలాశయం నుంచి నీరు

ప్రజాశక్తి-సీలేరు

ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నుంచి 4000 క్యూసెక్కులు నీటిని సీలేరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అవసరాలు నిమిత్తం తీసుకుంటున్నామని ఎస్ఈ సివిల్ కేకేవి.ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు జల విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి నిరాటంకంగా జరుగుతుందని వెల్లడించారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి పవర్ కెనాల్ 3/6 రీచ్ వద్ద కెనాల్‌కు గండి పడడంతో కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి, పోల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. దీంతో సీలేరు జల విద్యుత్ కేంద్రంపై ఒత్తిడి పెరిగిందని, ఈ నేపథ్యంలోని గ్రిడ్డు ఆదేశాలకు అనుగుణంగా సీలేరు జల విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తిని నిరంతర చేస్తున్నామని వెల్లడించారు. శుక్ర శనివారాల్లో 1.7 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేయడం జరిగిందని తెలిపారు. కెనాల్ గండి పనులు చేపట్టడానికి ఉన్నత అధికారుల నుంచి అనుమతులు కోరామని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడతామని చెప్పారు. పనులు చేపట్టిన తర్వాత ఎటువంటి సాంకేతికపరమైన సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు.

మాట్లాడుతున్న ఎస్ఇ ప్రశాంత్‌కుమార్

సిఎస్ఐ ఆధ్వర్యాన మెగా క్రిస్మస్

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి సిఎస్ఐ ట్రినిటీ చర్చ్ చిల్డ్రన్ అండ్ యూత్ ఆధ్వర్యంలో సిఎస్ఐ చర్చ్ గ్రౌండ్‌లో శనివావారం మెగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రూప్ చైర్మన్ రెవరెండ్ బి.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో బ్రదర్ ఎంవికె.శామ్యూల్ క్రిస్మస్ సందేశం అందించారు. ఏసుక్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని, అందరూ ఐక్యంగా ఉండాలని, పేదలపై కరుణ, దయతో ఉండాలని సూచించారు. అనంతరం క్యాండిల్ సర్వీసు, కేక్ కటింగ్ చేశారు. జెడ్పీటీసీ సభ్యులు గొర్లె బాలాజీ బాబు, సర్పంచ్ కొండ జకోబ్, మాజీ ఎంపీటీసీ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబి), మసిడోనియా పాస్టర్ బ్రోదర్ శామ్యూల్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యూత్, పిల్లలు ప్రదర్శించిన నాటికలు, భజనలు, నృత్యాలు అలరించాయి. ఆట పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ సెక్రటరీ గొర్లె అఖిమ్ రాజు, సెక్రటరీ కొర అజిత్, ట్రెజరర్ దూడ విల్సన్, సిఎస్ఐ యూత్ సభ్యులు గొర్లె దైవ దమయంతి, లాక్కొండ సతీష్ కుమార్, గొర్లె సతీష్ కుమార్, దూడ ప్రణీత్, బోరాగా సెడ్రక్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, యువతీ యువకులు

ఆగని పసికందుల మృత్యు ఘోష

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలో పసికందుల మరణ ఘోష ఆగలేదు. మండలంలోని పిన్నకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మూడు వారాల క్రితం పసికందులు, పెద్దలు మృత్యువాతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మూడు వారాల వ్యవధిలో జోనూరు గ్రామానికి చెందిన ముక్క బోయిన సుమిత్రకు జన్మించిన మూడు నెలల పాప, గంగమ్మకు జన్మించిన మూడు నెలల పాప సేంబి, సన్యాసమ్మకు జన్మించిన పాప ఒకరి తర్వాత ఒకరు వరుసగా మృత్యువాతకు పడ్డారు. పినకోట పంచాయతీ ఆనుకొని ఉన్న జోనూరులో ముగ్గురు, బీడిమెటులో ఇద్దరు చొప్పున ఆడ శిశువులు మూడు వారాల క్రితం మృత్యువాత పడ్డారు. బీడిమెటు గ్రామానికి చెందిన పాండవుల కాంతమ్మకు జన్మించిన మూడు నెలల పాప, పాండవుల బోడమ్మకు జన్మించిన పాప ఈ మూడు వారాల వ్యవధిలో మృతి చెందారని కుటుంబ సభ్యులు వాపోయారు.

అనారోగ్యంతో బాధపడుతూ బీడిమెటు గ్రామానికి చెందిన బిసంగి. చంద్రమ్మ (50) ఈనెల 17 సోమవారం మృతి చెందగా బుధవారం పాండవుల మల్లన్న (35) మృతి చెందుతున్నందంతో ఆ గ్రామానికి చెందిన ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆ గ్రామాలకు తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి తమ ప్రాణాలను కాపాడాలని ఆ గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు....

గత అక్టోబర్ నెల 15 నుండి 21 తేదీ మధ్యలో అనంతగిరి, లంగపర్తి, భీమవరం ఆసుపత్రుల పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన పసికందులు వరుస సంఖ్యలోనూ, బాలింతలు ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే.

సిఐటియు జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-జి.మాడుగుల:అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 20న జరిగే భారీ బహిరంగ సభను కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, స్కీం వర్కర్లు విజయవంతం చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు గొంది చరణ్ కుమార్ కోరారు. మండల కేంద్రములోని సిఐటియు కార్యాలయం వద్ద శనివారం మండల కమిటీ సభ్యులు, కార్మికులతో కలిసి మహాసభ గోడ పత్రికలు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను ఐక్య ఉద్యమాలతో తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జె. దీనబంధు, సభ్యులు విజయ, దేవినాయుడు, రామన్న పాల్గొన్నారు.

'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

గ్రామాల్లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలోని అరమ పంచాయతీ ముసిరి, గొందిగూడ, బడిమెల, పరిడి గ్రామాల్లో టిడిపి మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు ఆధ్వర్యంలో నాయకులు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుని, వైసిపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై గిరిజనులకు తెలియజేశారు. అనంతరం సుబ్బారావు మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వంతో గిరిజనులకు ఒరిగేదేమీ లేదని చెప్పారు. టిడిపి హయంలోనే అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కే సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి మృతి పట్ల పలువురిపై కేసు నమోదు ?

ప్రజాశక్తి - జి.మాడుగుల: జి.మాడుగుల గురుకుల పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థి మృతి చెందిన సంఘటన పై పోలీసులు పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం, తోటి విద్యార్థులు దాడి చేయడంతోనే తమ కుమారుడు మృతి చెందాడని మృతుడు కొండబాబు కుటుంబ సభ్యులు పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి మృతదేహానికి శనివారం పోస్ట్ మార్టం నిర్వహించారు. అనంతరం విద్యార్థి పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విద్యార్థి మతి ఘటన పై పాఠశాలకు చెందిన సుమారు ఆరు మందిపై కేసు నమోదు చేసినట్టు తెలిసింది. ఈ కేసును డిఎస్పీ స్థాయి అధికారి విచారిస్తున్నట్లు తెలుస్తుంది.

ఫారెస్టు అధికారుల కనుసన్నల్లోనే..

రంగురాళ్ల తవ్వకాలు?

ఆర్లి అడవిలో సొరంగం తవ్విన ప్రదేశం

- పది రోజుల్లో రూ.50 లక్షల వ్యాపారం
- వ్యాపారులకు సహకరిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది
- అదే విధంగా గుట్టుగా అటవీ కలప రవాణా

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నియోజకవర్గంలోని గొలుగొండ మండలంలోని మరో రంగురాళ్ల క్వారీ బయట పడింది. ఈ రంగురాళ్ల కారిలో విలువైన అలెక్స్ వంటి జాతి రాళ్లు లభ్యమవుతున్నట్లు సమాచారం. గొలుగొండ మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో దట్టమైన అడవి ఉండేది. ఇప్పుడు అది కాస్త అక్రమార్కుల చేతిలో నలిగి అడవి అంతా అంతరించి పోయింది. అక్రమార్కులు అక్రమంగా కలప నరికివేతతో అటవీ ప్రాంతం అంతరించిపోయింది. ఇదే కాకుండా ఈ అటవీ ప్రాంతంలో పప్పు శెట్టిపాలెం, కరక, ఇప్పుడు ఆర్లి అడవిలో రంగు రాళ్లు లభ్యమవుతున్నాయి. ఈ ప్రాంతంలో రంగు రాళ్ల తవ్వకాలతో పాటు అటవీ కలప రవాణా జరుగుతుంది. ఇది కేవలం అటవీ శాఖ అధికారులు, సిబ్బంది కనుసన్నల్లోనే జరుగుతుందనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. ఆర్లి అటవీ ప్రాంతంలో కొద్ది రోజులుగా రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ తవ్వకాలు అటవీశాఖ కిందిస్థాయి సిబ్బంది సహకారంతోనే జరుగుతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతుంది. అసలు ఫలానా ప్రదేశంలో రంగురాళ్లు దొరుకుతున్నాయనే సమాచారం ఇచ్చింది కూడా అటవీశాఖ కిందిస్థాయి సిబ్బందేనని ప్రచారం కూడా ఉంది. ఇంతే కాకుండా అటవీ శాఖ ఉన్నతాధికారికి గొలుగొండ అటవీ ప్రాంతం పై పూర్తి అవగాహన ఉంది. ఆయన గతంలో ఈ మండలంలోని పని చేశారు. గతంలో పప్పుశెట్టిపాలెం శివారులలో రంగురాళ్ల వ్యాపారులు పెద్ద పెద్ద సొరంగాలు తవ్వి రంగురాళ్లు వెలికి తీస్తున్న సమయంలో రెవిన్యూ, ఫారెస్ట్, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి తవ్వకాలను అరికట్టడమే కాకుండా సొరంగాలను కాంక్రీట్‌తో మూయించారు. తర్వాత కొద్ది రోజులు తవ్వకాలు నిలిచి పోయాయి. ఇప్పుడు మళ్లీ ఆరిలోవ అటవీ ప్రాంతంలో రంగురాళ్లు దొరుకుతుండడంతో వ్యాపారస్తులు కూలీలను ప్రోత్సహించి తవ్వకాలు మొదలు పెట్టారు. ఈ 15 రోజులలో సుమారు రూ.50 లక్షల రూపాయల వ్యాపారం జరిగినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు, సిబ్బంది స్పందించక పోవడం గమనార్హం. రంగురాళ్ళు విరివిగా లభిస్తుండటంతో కూలీలు గుంపులు గుంపులుగా ఆ ప్రాంతానికి ఇటీవల చేరుకున్నారు. ఒక దశలో అక్కడ ఘర్షణ వాతావరణం కూడా నెలకొంది. ఇంత హడావుడి జరుగుతున్నా ఫారెస్ట్ అధికారులు అటువైపు చూడక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. 15 రోజులుగా తవ్వకాల జరుగుతున్నప్పటికీ వాచర్లు, బీట్ ఆఫీసర్లు, రేంజర్ స్థాయి అధికారి కూడా నిలుపుదలకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. తవ్వకాల విషయం మీడియా ద్వారా బయటకు పొక్కడంతో అప్పుడు గాని డీఎఫ్ఓ ఆ ప్రాంతంలో పర్యటించ లేదు. మీడియా ద్వారా ప్రచారం అయిన తర్వాత డిఎఫ్ఓ అక్కడికి చేరుకోవడం ఆశ్చర్యం. తవ్వకాలను నిలుపుదల చేసిన తర్వాత ఇప్పటివరకు ఐదుగురు పైన కేసు నమోదు చేశారు. ఇంకా 25 మందిపై కేసు నమోదు చేయాలని అధికారులే తెలియజేశారు. మరి ఇప్పటివరకు వారిపై ఎందుకు కేసు నమోదు చేయలేదనే దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్పందించని అటవీశాఖ అధికారులు

ఇంత ముమ్మరంగా తవ్వకాలు జరిగినప్పటికీ రేంజర్, మిగతా అధికారులు, సిబ్బంది కనీసం స్పందించకపోతే రంగురాళ్ల తవ్వకాలు, కలప అక్రమ రవాణాను ఏ విధంగా అడ్డుకోగలరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు కూడా ఈ మండలంలో సిబ్బంది తీరుపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉందని పలువురు

జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల శస్త్రచికిత్సలు

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

పిఒకు సన్మానం చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీ నుండి కెజిహెచ్ కు వెళ్లకుండా అన్ని రకాల శస్త్ర చికిత్సలు జిల్లా ఆసుపత్రిలోనే నిర్వహిస్తున్నారని ఐటిడిఎ ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ పేర్కొన్నారు. ఏడాదిన్నర కాలంలో 1522 శస్త్ర చికిత్సలు పూర్తి చేసిన సందర్భంగా శనివారం జిల్లా ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశానికి ఐటిడిఎ పిఒ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా ఆసుపత్రి వైద్యాధికారులు అంకిత భావంతో వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు.జిల్లా ఆసుపత్రికి వెళితే ఆరోగ్యం మెరుగుపడుతుందనే నమ్మకం పెంచాలని సూచించారు. కెజిహెచ్ మాదిరిగా అన్ని రకాల వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రిలో ఎటువంటి సమస్య ఎదురైనా స్వయంగా కలవాలని సూచించారు. గిరిజన ఆరోగ్యానికి ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. వైద్యుల పోస్టులు భర్తీ చేస్తున్నారన్నారు. జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తే రూ.2కోట్ల 94 లక్షల నిధులు మంజూరు చేయడానికి సిఎం ఆమోదం తెలిపారన్నారు. వైద్యుల నివాసగృహాలకు మరమ్మత్తులు చేపడతామన్నారు. కొత్త క్వార్టర్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. వైద్యులకు వసతి సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వైద్యాధికారి జమాల్ భాషా మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రికి మౌలిక సదుపాయాలు కల్పించిన పిఒకు కృతజ్ఞతలు తెలియ జేసారు. జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ శంకర ప్రసాద్, శస్త్ర చికిత్సల వైద్య నిపుణులు డా.రవికిరణ్ మాట్లాడారు. ఈ సమావేశంలో క్రిష్ణారావు, అదనపు జిల్లా వైద్యాధికారి లీలా ప్రసాద్, వైద్యులు ప్రసన్న కుమార్, జగన్నాధం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనకు ప్రత్యేక కమిటీ

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టబద్రుల నియోజక వర్గం ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలనకు సంయుక్త కలెక్టర్ చైర్మన్‌గా పాడేరు సబ్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి సభ్యులుగా కమిటీని నియమిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసారు. డూప్లికేట్ ఎంట్రీలు, ఇతర అవకతవకలపై బూత్ స్థాయి అధికారి పరిశీలన చేసిన వాటిపై కమిటీ చెక్ చేసి తుది నిర్ణయం తీసుకొని నివేదిక అందించాల్సిందిగా ఉత్తర్వులలో సూచించారు.

నేడు లంబసింగిలో రిసార్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు:లంబసింగిలో నూతనంగా నిర్మించిన హరిత రిసార్ట్‌ను ఈ నెల 18న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖా మంత్రి ఆర్.కే రోజా ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు ప్రకటన విడుదల చేశారు. 18న ఉదయం 9 గంటలకు లంబసింగి చేరుకుంటారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడు కోట్ల రూపాయల అంచనాతో నిర్మించిన హరిత రిసార్ట్‌ను ప్రారంభించిన అనతరం మంత్రి తిరిగి 11 ప్రయాణం అవుతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు విశాఖపట్నం చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో మంత్రి పాల్గొంటారు

21, 22 తేదీల్లో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వినియోగదారుల హక్కులు, సమస్యలు, బాధ్యతలపై ఈనెల 21, 22వ తేదీల్లో అల్లూరి జిల్లా కేంద్రంలో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామని ఉమ్మడి జిల్లా వినియోగదారుల సంఘం కన్వీనర్ సత్యనారాయణ, జాతీయ వినియోగదారుల సంఘం అల్లూరి జిల్లా కన్వీనర్ సమర్డి రఘునాథ్ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలలో గెలుపొందిన వారికి రూ.3000, 2000, 1500 నగదు ప్రోత్సాహాలు అందిస్తామని తెలిపారు. ఈ పోటీలలో విజయం సాధించిన వారికి 24న విజయవాడ కేంద్రంలో వ్యాసరచన పోటీ ఉంటుందన్నారు.

బస్సు, బైకు ఢీ : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని కొట్నాపల్లి గ్రామం వద్ద శనివారం బస్సు, బైక్ ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురుకి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పాడేరు నుంచి అరకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. బైక్‌పై ఉన్న దుర్గం పంచాయతీ రణంకోట గ్రామానికి చెందిన వంతల శ్రీను, వంతల సుందరమ్మ, వంతల జ్యోతిలు గాయపడ్డారు. ముగ్గురు పరిస్థితి విషమం ఉండటంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

బోస్తోరి పిక్కల బస్తాలు

కానరాని గిట్టుబాటు ధర

ప్రజాశక్తి -హుకుంపేట మండల కేంద్రంలోని బోస్తోరి పిక్కలకు కనీసం మద్దతు ధర రాక పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం వారపు సంతకు అమ్మకానికి తీసుకు వచ్చారు. కేజీ రూ.45లకు కొనుగోలు చేయడంతో కనీసం రవాణా ఖర్చులకే సరి పోతుందిని రైతులు ఆవేదన వెలి బుచ్చారు.పండించిన పంటకు గిట్టుబాటు కూడా కాలేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించాలని కోరారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసిడిఎస్ పిఒ సువర్ణమ్మ పేర్కొన్నారు. మండలంలోని సోలభం పంచాయతీ ఎస్.పెదబయలు, నుర్మతి పంచాయతీ చేరువువీధి మెయిన్ అంగన్వాడి కేంద్రాలకు ఆయాలు (హెల్పర్లు), గడుతురు పంచాయతీ బర్సింగిమెట్ట మినీ అంగన్వాడి కార్యకర్త పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎస్టి కేటగిరీకి చెందిన మహిళా అభ్యర్థులు ఈనెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు జి.మాడుగుల ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు వివాహితులై స్థానికంగా స్థిరనివాసం కలిగి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు పూర్తి వివరాలతో కులము, నివాసం ధ్రువపత్రముల నఖలు గెజిటెడ్ అధికారితో అటెస్టెడ్ చేయించి సమర్పించాలని కోరారు.

కొయ్యూరు : మండలంలోని గంగవరం, బుగ్గిరాయి గ్రామాల్లో రెండు మినీ అంగన్వాడీ, రెండు హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి విజయలక్ష్మి తెలిపారు. వీటి భర్తీ కొరకు ఈ నెల 17 నుంచి 27వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను కొయ్యూరు ఐసీడీఎస్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

కమ్మేసిన పొగ మంచు

ప్రజాశక్తి - సీలేరు : జీకే.వీధి మండలం, సీలేరు పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటట వరకు మంచు తెరచాపలా కమ్మేసింది. రెండు రోజుల నుంచి చలి తీవ్రత అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ మంచు తీవ్రత అధికంగా ఉండడంతో వ్యాపారులు దుకాణాలు తొందరగా తెలవలేని పరిస్థితి నెలకొంది. మెయిన్ రోడ్డు, శివాలయం వీధి, ఫిష్ మార్కెట్ వైపు పూర్తిగా మంచుమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంక్రాంతి సమీపిస్తుండడంతో మంచు, చలి తీవ్రత మరింత ఉంటుందోనని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఉదయం కురుస్తున్న దృశ్యాలను పలువురు ఆసక్తిగా తిలకించారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో ఉన్న గిరిజనులు మంచు తీవ్రత అధికంగా ఉండడంతో పొలం పనులకు ఉదయం 10 గంటల వరకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం : కూనవరం మండలం, కూటూరు గ్రామపంచాయతీలోని జిసిసి డిపో ద్వారా నిత్యావసర సరుకులను శనివారం సర్పంచ్ బి.వెంకమ్మ, సెక్రెటరీ శ్రీనివాస్, వార్డు సభ్యులు పంపిణీ చేశారు. నవంబర్ 23న సర్పంచ్ బి.వెంకమ్మ, మాజీ ఎంపిటీసీ మేకల నాగేశ్వరరావు ఆధ్వర్యాన డిపోను సందర్శించగా, నాడు నిత్యావసరాలు సక్రమంగా అందడం లేదని ఫిర్యాదు అందింది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారమైంది. ఈ సందర్భంగా వెంకమ్మ, మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అధికారులు స్పందించి నిత్యవసర వస్తువులను పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రతి నెలా ఇవ్వాల్సిన పంచదార, పప్పు నూనె ప్రభుత్వం నుండి రప్పించినందుకు ప్రజలు సర్పంచ్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శీలం వెంకమ్మ, సొడే నాగేశ్వరావు, బొడ్డు కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎయు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యువతకు దిశా నిర్దేశం చేసిన ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి

మాట్లాడుతున్న నారాయణమూర్తి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనం - 6 శనివారం సాయంత్రం బీచ్‌రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఇన్ఫోసిస్ సంస్థ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి హాజరై మాట్లాడారు. జాన్ కెనడీ చెప్పిన మాటలను గుర్తు చేశారు. మనకి దేశం ఏమిచ్చింది అనే దానికంటే మనం దేశానికి ఏమిచ్చాం అన్న మాటలు తనను ఎంతగానో ఆకర్షించాయని, ప్రతి ఒక్కరూ తాము ఉండే సమాజం పట్ల అవగాహన, బాధ్యత కలిగి ఉండాలని అన్నారు. దేశం పట్ల యువత ప్రేమను చూపాలన్నారు. సహచరులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తగిన ప్రణాళికలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. భారతదేశం సైన్స్, టెక్నాలజీ, వైద్య రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. కుల, మత, ఆర్థిక విభేదాలను పక్కన పెట్టి సమిష్టిగా ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఎవరికైనా చేసే పనిలో రాణించడం ద్వారానే గుర్తింపు, గౌరవం వంటివి వస్తాయని తెలిపారు. జిఎంఆర్ గ్రూప్ చైర్మన్ జిఎం.రావు మాట్లాడుతూ 2025లో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు జరుపుకోనుందని తెలిపారు. డిజిటల్ ఎకానమీలో భారతదేశం అమెరికా, చైనా తరువాత స్థానంలో ఉందని తెలిపారు. విద్యార్థులు తగిన ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు. ఎయు విసి పివిజిడి.ప్రసాద్‌రెడ్డి యూనివర్సిటీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, నూతన ఆవిష్కరణలు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ఎయు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అవంతి ఫీడ్స్ లిమిటెడ్ చైర్మన్ అల్లూరి ఇంద్ర కుమార్, బివిఎస్.రావు, ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఆచార్య బీల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుపై ఏర్పడిన రంధ్రాన్ని చూపుతున్న ఎంపిటిసి సభ్యులు ప్రదీప్ కుమార్

కల్వర్టుపై రంధ్రాన్ని పూడ్చరూ..

ప్రజాశక్తి-విఆర్.పురం : మండల కేంద్రం విఆర్ పురం నుంచి చింతూరు వెళ్ళే ప్రధాన రహదారిలో పెద్దమట్టపల్లి గ్రామం వద్ద ఆర్ అండ్ బి రహదారిలో కల్వర్టుపై పెద్ద రంధ్రం పడి ఉందని, దానిని తక్షణమే పూడ్చాలని ఎంపిటిసి సభ్యులు పూనెం ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన రంధ్రం ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రంధ్రం పడి చాలా రోజులు అవుతున్నా ఆర్ అండ్ బి అధికారులు ఇంత వరకు పూడ్చకపోవడం వారి నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందన్నారు. ఈ రంధ్రం కారణంగా రాజమండ్రి వెళ్ళే బస్‌లు కూడా నిలిపి వేసే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఆస్పత్రులకు, నిత్యవసరాల కోసం, ప్రభుత్వ కార్యాలయాలకు మండల కేంద్రానికి రావాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రంధ్రానికి మరమ్మతులు చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కారం సత్తిబాబు, మిడియం సీతయ్య, మోసం చంద్రరావు, పాల్గొన్నారు.

జగనన్న కాలనీ నిర్మాణ పనులు వేగవంతం

జివిఎంసి కమిషనర్ రాజాబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జగనన్న కాలనీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. శనివారం ఆయన పరవాడ మండలం దేశపాత్రుని పాలెంలోని జగనన్న కాలనీ లే-అవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేసి, ఇళ్ళు కట్టించి ఇస్తోందన్నారు. దీనిలో భాగంగా దేశపాత్రునిపాలెంలో 194 ఎకరాలలో 5065 ప్లాట్లను అభివృద్ధి చేసి ఇళ్ళు నిర్మించేందుకు పనులు మొదలు పెట్టామని, మొదటి దశలో 1331 ఇళ్ళు నిర్మిస్తామని, ప్రాజెక్ట్ ఖరీదు రూ.7.98 కోట్లని, ఒక్కొక్క యూనిట్ 340 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాలో ఉందని తెలిపారు. జగనన్న ఇళ్లలో ఒక ఫ్యామిలీ నివాసం వుండే విధంగా బెడ్ రూము, హాలు, కిచెన్, బాత్రూం, వరండా ఉంటాయని తెలిపారు. పనుల నాణ్యతలో రాజీపడబోమన్నారు.

కాంట్రాక్టర్‌కు కావలసిన మౌలిక వసతులైన ఫ్లడ్‌లైట్లు, మంచినీరు, నీటి సంపులు, వాచ్‌మెన్ గదిలాంటి వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) పాపు నాయుడు, డిసి (రెవెన్యూ) ఫణిరాం, జోనల్ కమిషనర్ సింహాచలం, ఎంఒహెచ్ డాక్టర్ కిరణ్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక ఇంజినీరు ఆర్‌పి.రాజు, సహాయక ఇంజినీరు గోపి, తదితరులు పాల్గొన్నారు.

కొత్త భవనంలోకి చేరుకున్న ఆనందంలో విద్యార్థులు

కొత్త భవనంలోకి ఏకలవ్య విద్యార్థులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని రాజవొమ్మంగి గ్రామ శివారులో ఇటీవల రూ.20 కోట్లతో నిర్మించిన ఏకలవ్య పాఠశాల నూతన భవనం లోనికి ఎట్టకేలకు శనివారం విద్యార్థులు అడుగుపెట్టారు. ఇప్పటివరకు ఏకలవ్య పాఠశాల తాళ్లపాలెం పాత భవనంలో నిర్వహించబడేది. ఆధునిక సదుపాయాలతో విశాలమైన తరగతి గదులతో నిర్మించడంతోపాటు, డార్మటరీ, వంటశాల వంటివి విశాలంగా నిర్మించారు. ఈ పాఠశాలలో 6 నుండి 9వ తరగతి వరకు 240 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి నాణ్యమైన విద్య అందించడంతో బాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎంవి.కృష్ణారావు తెలిపారు.

50 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలో శనివారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజవొమ్మంగి పిహెచ్సీ వైద్యాధికారులు లిఖిత, నాగరాజు 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వివిధ రుగ్మతులతో బాధపడుతున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి ఆహారం తీసుకోవాలని, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

పోర్టు ప్రయివేటీకరణపై 19న ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 19న మధ్యాహ్నం 12 గంటలకు పోర్టు ఎఒబి ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాలని విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాలు నిర్ణయించాయి. శనివారం ఎఐటియుసి ఆఫీసులో అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం జరిగింది. మేజర్ పోర్టుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, షరతులు లేని వేతన ఒప్పందాన్ని వెంటనే చేయాలని, బోనస్ (పిఎల్ఆర్) బ్యాలెన్స్ చెల్లిస్తూ కొత్త ఫార్ములా రూపొందించాలని డిమాండ్ చేశారు.